క్లుప్తంగా

21న ఫీల్డ్ అసిస్టెంట్ల పెన్ డౌన్



ఎంపీడీవో విజయ్ కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

పద్మనాభం: వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న ఒక రోజు విధులు బహిష్కరించి, పెన్ డౌన్ చేపడతామని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు తెలిపారు. వేతనాలు పెంచాలని కోరుతూ బుధవారం వారు ఎంపీడీవో విజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. 2016 నుంచి వేతనాలు పెంచలేదని తెలిపారు. ముందుగా పెన్‌డౌన్ చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 28 నుంచి పూర్తిగా విధులు బహిష్కరిస్తామని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వంకల సత్యం, మండల అధ్యక్షుడు కోరాడ జగదీష్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

చంద్రంపాలెంలో మజ్జిగ పంపిణీ



దుర్గాలమ్మ ఆలయం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న పద్మశాలీ సేవా సంఘం ప్రతినిధులు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయ ఆవరణలో పీఎం పాలెం పద్మశాలీ ఆత్మీయ సేవాసంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు కేవీ నాగేశ్వరరావు, కోశాధికారి పొన్నగంటి నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ బేతా అప్పన్నకుమార్, షణ్ముఖరావు, పాండురంగ విఠలరావు తదితరులు పంపిణీని ప్రారంభించారు. పాదచారులు, వాహనదారులు, భక్తులకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కార్యవర్గ సభ్యులు నాగోతి తాతారావు, పొట్నూరి హరికృష్ణ, పోతిన పైడిరాజు తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గ్యాస్ వినియోగంపై మహిళలకు అవగాహన



అపార్ట్‌మెంట్ వద్ద మహిళలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తగరపువలస: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం సంగివలస అపార్ట్‌మెంట్ల వద్ద గ్యాస్ వినియోగంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అగ్నిమాపక కేంద్రం అధికారి జి.శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్యాస్ పొయ్యి ఎప్పుడూ ఎత్తులోనే ఉండాలని, సిలిండర్ కిందకు కొద్దిగా దూరంగా ఉండాలని తెలిపారు. గ్యాస్ వినియోగం అయిపోయిన తరువాత తప్పనిసరిగా సిలిండర్‌ను కట్టేయాలని, ఇది ఎంతో ముఖ్యమైనదని చెప్పారు. ఒకవేళ గ్యాస్ లీకైతే ఇంట్లో లైట్లు గానీ, ఫ్యాన్లు గానీ వెంటనే వేయకూడదని.. తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలని తెలియజేశారు.

ప్రమాదకరంగా ఫీడర్ బాక్సులు



కూలిపోయిన ఫీడర్ బాక్సు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ, మిథిలాపురి వుడాకాలనీ ప్రాంతాల్లో భూగర్భ విద్యుత్ కోసం ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ ఫీడర్ పిల్లర్స్ (ఫీడర్ బాక్సులు) ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. ఇవి ధ్వంసమై నేలకొరిగాయి. నెలల తరబడి ఇలా నేలకొరిగి ఉన్నా.. విద్యుత్‌శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటుగా ఉదయం పూట వాకింగ్‌కు చిన్నారులు, పెద్దలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో ఎవరికైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అదే విధంగా వర్షాలు పడిన సమయంలో మరింత ప్రమాదకరం. అధికారులు స్పందించి, వీటిని వెంటనే సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

అక్రమాల పంథా

- యథేచ్ఛగా బ్లాక్‌ఆయిల్ విక్రయాలు
- చోద్యం చూస్తున్న పోలీసులు, ఇతర అధికారులు
- అక్రమ వ్యాపారానికీ జీఎస్టీ



వాహనాల్లో తరలిపోతున్న బ్లాక్ ఆయిల్



డబ్బాల్లో నింపిన బ్లాక్ ఆయిల్



వాహనాల్లో లోడ్ చేయడానికి తీసిన గోతుల వద్ద బ్లాక్ ఆయిల్ డబ్బాలు

మధురవాడ: మధురవాడలో బ్లాక్ ఆయిల్ దందా యథేచ్ఛగా సాగిపోతోంది. గతంలో విశాఖ-విజయనగరం జిల్లా సరిహద్దుల్లోని మహారాజుపేట, తర్వాత వలందపేట, ఆనందపురం పరిసర ప్రాంతాలలో సాగగా.. పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడంతో అక్రమ వ్యాపారులు బెంబేలెత్తిపోయారు. ఇది కొన్నేళ్ల నాటి సంఘటన..

ఇప్పుడు తాజాగా ఓ వ్యక్తి మధురవాడలోనే యథేచ్ఛగా ఈ దందా నిర్వహిస్తున్నాడు. పైగా జీఎస్టీ కట్టే వ్యాపారం చేస్తున్నానని, ఇక తనకు పోలీసులు, జీవీఎంసీ అనుమతితో పనేంటి అంటూ సెలవిస్తున్నాడు. ఈ అక్రమ తతంగం అంతా పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ముఠా గుట్టుచప్పుడు కాకుండా, అందరినీ మేనేజ్ చేసి మరీ నిర్వహిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. వీరు సెక్యూరిటీ, ఇతర అధికారుల కంటపడకుండా పరిశ్రమలు, ఆయిల్ ట్యాంకర్ల నుంచి, మెకానిక్ ఇతర దుకాణాల నుంచి అక్రమ పద్ధతుల్లో తెచ్చి మధురవాడ అయోధ్యనగర్‌కు కాస్త దూరంగా ఉన్న లే అవుట్‌లో ఉన్న ఒక పాడుబడిన, తుప్పల మధ్యలో ఉన్న షెడ్‌లో డంప్ చేస్తున్నారు. దీని చుట్టూ చెట్లు, తుప్పల మధ్య భారీ డ్రమ్ముల్లో నింపి ఇతర ప్రాంతాలకు తరలించేందుదుకు వీలుగా నిల్వ ఉంచుతున్నారు. దీని మాటున ఇంజిన్ ఆయిల్, డీజిల్ వంటివి కూడా కల్తీ జరుగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. మిగిలిన ఆయిల్ ఇక్కడ నుంచి పెద్ద పెద్ద డ్రమ్ముల్లో నిల్వ ఉంచి వాహనాల ద్వారా, ఆయిల్ ట్యాంకర్ల ద్వారా పెద్ద ఎత్తున అర్ధరాత్రి సమయాల్లో గుట్టుచప్పుడు కాకుండా విశాఖ జిల్లాలోని ఇతర ప్రాంతాలు ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. రోజూ పదుల సంఖ్యలో డ్రమ్ములు, ఆయిల్ ట్యాంకర్ల ద్వారా జిల్లా సరిహద్దులు దాటించేస్తున్నా నిఘా వర్గాలు గానీ, ఇంత దర్జాగా నల్ల వ్యాపారం సాగుతున్నా పోలీసు, విజిలెన్స్ ఇతర అధికారుల కంట పడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల మారికవలస సమీపంలో స్క్రాప్ దుకాణంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో కూడా ఇలాంటి ఆయిలే ప్రధాన కారణం అంటూ ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ నిత్యం 50 డ్రమ్ములపైనే నివాసాలకు సమీపంలో ఆయిల్ నిల్వ ఉంచడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా ఆయిల్‌లో జరిగే అనేక రకాల కల్తీలకు ఇదే ప్రధాన కారణంగా ఉంటుందన్నది జగమెరిగిన సత్యం. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి, తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నివాస గృహాల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం



రెవెన్యూ అధికారులు ప్రచారం చేయిస్తున్న ఆటో

మధురవాడ: ఆనందపురం మండలంలోని వివిధ గ్రామాల్లో నివాస గృహాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దారు శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మండలంలోని అన్ని ప్రాంతాల్లో వీఆర్వోలు, సచివాలయాల ద్వారా సమాచారం ఇవ్వడంతో పాటు ఆటో ద్వారా ప్రచారం కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాలలో ఆక్షేపణీయం కాని ప్రభుత్వ భూముల్లో 15 అక్టోబర్ 2019కి ముందు నివాసం ఉంటున్న 150 చదరపు గజాల ఇళ్లకు ఉచితంగా పట్టాలు అందజేస్తామన్నారు. అంతకంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన ఇళ్లకు మార్కెట్ విలువ వసూలు చేయడం ద్వారా హక్కులను క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. ఇందుకోసం 30వ నెంబర్ జీవోని ప్రభుత్వం విడుదల చేసిందని, ఈ అవకాశాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రక్రియకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం కోసం వీఆర్వో లేదా గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు. అర్హత, ఆసక్తి గలవారు క్రమబద్ధీకరణ చేయాల్సిన ఇంటి పన్ను రసీదు, కరెంటు బిల్లు, ఆధార్‌కార్డు, ఇతరుల నుంచి కొనుగోలు చేసినట్లయితే సదరు సమయంలో రాసుకున్న పత్రాలతో పాటు 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు సమర్పించవలసి ఉంటుందని చెప్పారు. మరిన్ని వివరాలకు తమను 91000 64933 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సిరిమానుకు ప్రత్యేక పూజలు



గంధవరంలో చెట్టు వద్ద పూజలు చేస్తున్న పాండ్రంగి వాసులు



పాండ్రంగిలోకి తీసుకువచ్చి పసుపు, కుంకుమ పెట్టిన సిరిమాను

పద్మనాభం: పాండ్రంగి గ్రామ ప్రజల ఆరాధ్య దైవం జట్లమ్మ ప్రతిరూపమైన సిరిమానుకు బుధవారం ఘనంగా పూజలు చేశారు. పాండ్రంగిలో వచ్చే నెల 12 నుంచి 13 వరకు జట్లమ్మ ఉత్సవాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా 13వ తేదీన సిరిమాను ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సిరిమాను కోసం గంధవరంలోని గుమ్మిడి వారి కళ్లాల్లో ఉన్న చింత చెట్టుకు బుధవారం ఉదయం పూజలు చేసి, నరికి గ్రామంలోకి తీసుకువచ్చారు. బోని, పాండ్రంగి ప్రజలు సిరిమానుపై నీళ్లు పోసి పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజాసాగి పవన్ కుమార్, వర్మ, గంధవరం సర్పంచ్ జి.వి.కె.కె.వర్మ, ఎంపీటీసీ సభ్యుడు బి.వి.ఎస్.ఎన్.రాజు, కుచ్చర్ల రామరాజు, అముజూరి అప్పారావు, పల్లి మహేష్, మహంతి శ్రీను పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో పైపులైన్లు, డ్రైనేజీలు వేసేదెప్పుడు?

- పండగనాటికైనా తాగునీరు ఇస్తారా?
- జెడ్పీ సమావేశంలో అధికారులను ప్రశ్నించిన వైస్ చైర్మన్ గిరిబాబు



జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ గిరిబాబు

పద్మనాభం: రెడ్డిపల్లిలో రోడ్డు విస్తరణలో భాగంగా పోయిన తాగునీటి పైపు లైన్, తారు రోడ్డుకు ఇరువైపులా సిమెంట్ డ్రైనేజీలు ఎప్పుడు వేస్తారని జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు జిల్లా పరిషత్ సమావేశంలో ప్రశ్నించారు. విశాఖలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పద్మనాభం జంక్షన్ సమీపంలోని కన్నయ్య కోనేరు నుంచి రెడ్డిపల్లి సినిమా హాలు వరకు సుమారు మూడు కిలోమీటర్ల నిడివిలో 12 అడుగుల రోడ్డును 40 అడుగులకు విస్తరించడానికి, రోడ్డుకిరువైపులా సిమెంటు డ్రెయిన్లు నిర్మించడానికి రూ.10.04 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ రోడ్డు పనులను ప్రస్తుత రాయదుర్గం టీడీపీ ఎమ్మెల్యే సురేంద్రబాబుకు చెందిన ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అప్పట్లో టెండర్‌లో పాడుకుందన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా రెడ్డిపల్లిలో లోతట్టు ప్రాంతమైన కిలో మీటరు నిడివిలో సిమెంటు రోడ్డు నిర్మించడానికి, మిగతాది బీటీ వేయడానికి నిర్ణయించారు. ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అప్పట్లో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకుండా తాత్సారం చేసిందని తెలిపారు.

సిమెంట్‌రోడ్డు వేయకుండా బీటీ రోడ్డు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత కిలో మీటర్ నిడివిలో సిమెంటు రోడ్డు వేయకుండా బీటీ రోడ్డు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా సైడు కాలువలు నిర్మించకుండా బీటీ రోడ్డు వేశారని మండిపడ్డారు. డ్రైనేజీల్లేక మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోతోందన్నారు. రోడ్డు విస్తరణలో పైపులైను పోవడంతో మూడేళ్లుగా ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వచ్చే నెలలో రెడ్డిపల్లిలో గ్రామదేవత బంగారమ్మ పండగ ఉందని, పైపులైన్ వేయకపోతే వచ్చిన బంధువులకు తాగునీరు కూడా ఇవ్వలేని పరిస్థితి తలెత్తుతుందని పేర్కొన్నారు. పండగకైనా తీగునీరు ఇస్తారా.. అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందిస్తూ పైపులైను, సిమెంటు డ్రైనేజీలు తక్షణమే నిర్మించేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

కూడలిలోనే లోడింగ్, అన్‌లోడింగ్

రోడ్డుపై నిలిపేస్తున్న పార్సిల్ వాహనాలు



ఆదర్శనగర్ కూడలిలో సర్వీస్‌రోడ్డుపై నిలిపివేసిన పార్సిల్ లారీ



కూడలిలో రెండు మలుపుల వద్ద వాహనాలు నిలిపి సామన్లు దించుతున్న దృశ్యం

తగరపువలస: చిట్టివలస ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఆనుకుని ఆదర్శనగర్ కూడలిలో నిత్యం పార్సిల్ వాహనాలు నిలిపి, సరకు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే చిట్టివలస ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఆనుకుని డ్రైనేజీని ఆక్రమించి పలువురు దుకాణాలు నిర్వహిస్తూ సర్వీస్‌రోడ్డుపైకి వ్యాపారాలు విస్తరించారు. దీంతో తగరపువలస నుంచి విశాఖ వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇబ్బంది కలుగుతూనే ఉంది. బడా నాయకులే ఈ స్థలాలను ఆక్రమించి చిరు వ్యాపారుల నుంచి భారీ అడ్వాన్సులు, అద్దెలు తీసుకుని చలామణీ అవుతున్నారు. ఇప్పుడు ఈఎస్‌ఐ ఆస్పత్రి నుంచి సంతపేట గొల్లవీధి, ఆదర్శనగర్, టీచర్స్ కాలనీ మార్గాలు రద్దీగా మారిపోయాయి. అలాంటి రద్దీ మార్గంలో పలు పార్సిల్ సంస్థలు వ్యాపారాలు నిర్వహిస్తున్నాయి. సర్వీస్‌రోడ్డుపైనే గంటల కొద్దీ వాహనాలు నిలిపి లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్నాయి. దీంతో ఈ మూడు కూడళ్ల మీదుగా వేగంగా వచ్చే వాహనదారులు ఈ ప్రాంతంలో అయోమయానికి గురవుతున్నారు. ముఖ్యంగా ఆనందపురం నుంచి ఆదర్శనగర్ వైపు వెళ్లే వాహనాలకు ముందుండే రహదారి కనిపించడం లేదు. ఈ కూడలిలో రహదారుల మీద అడ్డంగా వాహనాలు నిలపనీయకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డెక్కిన మురుగు

అపార్ట్‌మెంట్‌కు సరైన అవుట్‌లెట్ లేక సమస్య



దుర్గానగర్-ఎన్‌జీజీవోస్ కాలనీ రోడ్డులో రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగునీరు



కాల్వలేక మురుగునీటి సమస్యకు కారణమైన అపార్ట్‌మెంట్

మధురవాడ: జీవీఎంసీ ఏడో వార్డు చంద్రంపాలెం దుర్గానగర్ ఎన్‌జీజీవోస్ కాలనీలో మురుగునీరు నెలలు తరబడి రోడ్డుపైనే ప్రవహిస్తోంది. నిత్యం ఇదే పరిస్థితి ఉండడంతో కాలనీవాసులు, వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డులో చంద్రంపాలెం గ్రామం దాటిన వెంటనే నిర్మాణమైన అపార్ట్‌మెంట్‌కు మురుగునీరు పారుదలకు సక్రమమైన అవుట్‌లెట్ లేకుండా జీవీఎంసీ అధికారులు ప్లాన్, ఓసీ కూడా ఇచ్చేశారు. ఇది ప్రారంభమై, సుమారు 50 ఫ్లాట్లలోనూ కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. రెండేళ్లు దాటుతున్నా ఈ అపార్ట్‌మెంట్‌కు సరైన డ్రైనేజీ లేకపోవడంతో వాడుకనీరంతా రోడ్డుపైకి వచ్చి నిల్వ ఉండిపోతోంది. ఈ మురుగులో వాహనాలు వెళ్తున్నప్పుడు నీరు తుళ్లి నివాసాలపైకి, పాదచారుల మీదకు పడడంతో ఇబ్బంది పడుతున్నారు. పైగా మురుగు నిల్వ ఉండడంతో దుర్గంధం, ఈగలు, దోమలతో పరిసరప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నారు.

ఊరు బయటకే ఔట్‌లెట్ ఏర్పాటు చేయాలి

ఈ అపార్ట్‌మెంట్ వాడుకనీటిని ఎన్‌జీజీవోస్ కాల్వ వైపు మళ్లించకుండా చంద్రంపాలెం గ్రామంలోకి కనీసం అడుగు మాత్రమే నిడివి ఉన్న కాల్వలోకి మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మురుగు నీటిని గ్రామంలోని కాల్వలకు అనుసంధానిస్తే ఊరంతా మురుగు పొంగిపొర్లి, మరిన్ని సమస్యలు వస్తాయని చంద్రంపాలెం వాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో కాల్వలు నిర్మించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

సమ్మర్ స్పెషల్ .. గోలీ సోడా



కారుషెడ్ కూడలిలో గోలీసోడా దుకాణం

పీఎం పాలెం: మండే వేసవిలో గోలీ సోడాలకు మంచి డిమాండ్ ఉంటోంది. గతంలో పల్లె పట్టణమనే తేడా లేకుండా వేసవిలో దాహం తీర్చిన ఈ పానీయం సోడస్సోడా... ఆంధ్ర సోడా .. అంటూ ఊరూవాడా వాసికెక్కింది. కాలగమనంలో అనేక శీతల పానీయాల కంపెనీలు మార్కెట్‌ను ఆక్రమించడంతో గోలీ సోడా ప్రాభవం తగ్గింది. నేడు శీతల పానీయాల కంపెనీలు పోటీ పడుతుండగా మధ్యలో నేనూ ఉన్నానంటూ మార్కెట్‌లోకి సరికొత్తగా ప్రవేశించింది గోలీసోడా.

90 దశకానికి ముందు గోలీ సోడాకు ప్రత్యేక స్థానం ఉండేది. కిసుక్కుమనే శబ్దం దాని ప్రత్యేకత. కొంతమంది తమ ఇళ్ల వద్దే మంచినీటిని గోలీ సోడా సీసాలో నింపి ప్రత్యేక మిషన్ సహాయంతో గ్యాస్ ఎక్కించేవారు. కొన్ని కుటుంబాలు ఈ సోడాల తయారీనే వృత్తిగా ఎంచుకుని జీవనం సాగించేవి. శీతల పానీయాల హవా పెరగడంతో పోటీ తట్టుకోలేక గోలీ సోడాలు దాదాపుగా కనుమరుగయ్యాయి. గోలీసోడా తయారీ రిస్కుతో కూడుకున్న పని. గ్యాస్ ఎక్కించే సమయంలో అవి పేలి, ప్రమాదాలు జరగడం కూడా మరొక కారణంగా గతంలో సోడాలు తయారు చేసేవారి మాటల బట్టి తెలుస్తోంది. ఇప్పుడు పరిస్థితి మారింది. గోలీసోడాలు కూడా ఆకర్షణీయమైన రంగుల్లో మార్కెట్‌లోకి ప్రవేశించాయి. తయారు చేసే కొత్త కంపెనీలు కూడా వెలిశాయి. కారుషెడ్ కూడలి, శిల్పారామం, వుడా రోడ్డులో, మధురవాడలో గోలీసోడాలు విక్రయించే షాపులు వెలిశాయి. ప్రస్తుతం రూ.10, 15 రూపాయలకు గోలీ సోడాలు విక్రయిస్తున్నారు. వినియోగదారు కూడా పేరున్న శీతల పానీయాల కంటే గోలీసోడాలు తాగడానికే మొగ్గు చూపడం విశేషం. సోడాలు బాగానే అమ్ముడుపోతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

నాటక రంగాన్ని బతికించుకుందాం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహారావు



గోపాత్రుడు నాటికలోని ఓ సన్నివేశం

విశాఖ విద్య: నాటక రంగాన్ని బతికించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా బుధవారం ఏయూ ఓపెన్ థియేటర్‌లో తెలుగు నాటకం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కందుకూరి చిత్రపటానికి వర్సిటీ ఆచార్యులతో కలసి నరసింహారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరేశలింగం జయంతిని నాటక రంగ దినోత్సవంగా ప్రకటించడం నాటక రంగానికి గుర్తింపు దక్కినట్లేనన్నారు. కళలకు పుట్టినిల్లు ఉత్తరాంధ్రలో నాటక రంగానికి నేటికీ మంచి ఆదరణ లభిస్తోందన్నారు. టెక్నాలజీ ఎంత పెరిగినా.. సమాజం ఉన్నంత వరకు నాటకం బతికే ఉంటుందని పేర్కొన్నారు. సమాజ ఇతివృత్తాలను కళ్లకు కట్టినట్లుగా చూపించే అవకాశం ఒక్క నాటక రంగలోనే ఉంటుందని చెప్పారు. ఆంధ్రా యూనివర్సిటీలో థియేటర్ ఆర్ట్స్ విభాగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేలా తగిన ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రదర్శించిన గోపాత్రుడు నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.శశిభూషణ్‌రావు, ఆచార్య ప్రేమనందం, ఆచార్య విజయ్‌మోహన్, ఆచార్య పల్లవి, డైరెక్టర్ డా.కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే భవిష్యత్తు



బిల్డ్ భారత్ హ్యాక్‌థాన్ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు, ఆచార్యులు

విశాఖ విద్య: భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారంగా నడుస్తుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పేర్కొన్నారు. ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం సంయుక్తంగా బుధవారం నిర్వహించిన బిల్డ్ భారత్ హ్యాక్‌థాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత మేధస్సుకు పదును పెట్టే విధంగా ఈ కార్యక్రమం నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువత ఇక్కడ నుంచి స్ఫూర్తిని పొంది నూతన అంకుర సంస్థలను స్థాపించేలా అడుగులు వేయాలన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల నుంచి 488 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. యువతను ప్రోత్సహించడం, వారి ఆలోచనల నుంచి అనేక సమాజ ఉపయుక్త పరిష్కారాలను తీసుకురావడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్యులు పాల్గొన్నారు.